మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# కొల్లాపూర్‌లోనే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నాను..

- ◆ ప్రజా సంక్షేమం కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టాం ◆ ప్రపంచాన్ని ఆకర్షించేలా తెలంగాణ టూరిజం
- ◆ ప్రతి పేదవాడు ఆత్మ గౌరవంగా జీవించే అవకాశాలను కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- ◆ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 2 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతి పేదవాడు ఆత్మ గౌరవంగా జీవించే అవకాశాలను కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే అధికారాన్ని ప్రజలకు ఇచ్చామని, ప్రజల ఆలోచనలే మా ఎజెండాగా పనిచేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని కొల్లాపూర్ పట్టణంలో రాజుగారి కోట దగ్గర ఏర్పాటుచేసిన నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలను ఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ అలీఫరూఖీ, ట్రాన్స్‌కో, వనపర్తి ఎమ్మెల్యేతూడి మెగా రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపనలు, నూతన రేషన్ కార్డులు, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లమంజూరు నిర్మాణాల పత్రాలు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రూ.65.67 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ నున్న 7 విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగాఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాయలసీమ ఎత్తిపోతల పై తెలంగాణ భూభాగంలో ఒక డ్యామ్ కడితే పెద్ద ఎత్తున కృష్ణ నీటిని తీసుకునే అవకాశం ఉన్న నాటి ప్రభుత్వం ఎందుకు ఆలోచన చేయలేదని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతం చేశామని తెలిపారు. పర్యాటక రంగంలో తెలంగాణ ప్రపంచాన్ని ఆకర్షించేలా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అప్పుల భారం ఉన్నప్పటికీ వాటిని అధిగమించి గత ప్రభుత్వ పెద్దలు చేసిన అప్పులకు 6,500 కోట్లు ప్రతినెల వడ్డీ కడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల మొదటి తేదీన జీతాలు ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రజల సంక్షేమం కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 10 లక్షలకు పెంచాం, ఇప్పటివరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలు 200 కోట్ల సార్లు ఉచితంగా ప్రయాణం చేశారని ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం 6680 కోట్లు మహిళల పక్షాన ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా పేదలకు 5లక్షలతో ఒక్కో ఇంటిని నిర్మిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు మొదటి దశలో నిర్మించేందుకు 22,500 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పదివేడిగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని, గత పది సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లు పేదలకు పంచలేదు అని డిప్యూటీ సీఎం వివరించారు.

**కొల్లాపూర్‌లోనే రాజకీయ ఓనమాలు:** మా సోదరుడు స్వర్గీయ మల్లు అనంత రాములు 1980లో నాగర్ కర్నూల్ ఎంపీగా పోటీ చేసిన సమయంలో తాను విద్యార్థిగా ఉన్నానని, ఆ సమయంలో తనను కొల్లాపూర్ ఇన్చార్జిగా నియమించారని, ఆనాడే తాను రాజకీయ ఓనమాలు దిద్దుకున్నానని ఉప ముఖ్యమంత్రి వివరించారు. నియోజకవర్గ ఇన్చార్జిగా ఊరూరా తిరిగి ప్రజలతో మమేకం కావడం కొల్లాపూర్‌తోనే ప్రారంభమైందని, తనకు మధిర నియోజకవర్గంతో ఎంతటి అనుబంధం ఉందో కొల్లాపూర్‌తోను అంతే అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొల్లాపూర్ ఎక్కడో దూరంగా ఉందని అంతా అనుకుంటారు కానీ ఈ నియోజకవర్గంలో అన్ని రకాల భావజాలాలు ఉన్నాయని తెలిపారు. పాలమూరు ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా కొల్లాపూర్‌లో రాజకీయ జీవితం ప్రారంభించిన తాను డిప్యూటీ సీఎంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర **ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోతిరెడ్డిపాడు కాల్వ ద్వారా కృష్ణాజలాలను ఇప్పటికే భారీగా తరలించుకుపోతున్నదని, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణతో మన ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, శ్రీశైలం రిజర్వాయర్ లోని నీళ్లు 2,3 నెలల్లోనే ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత నీటి సమస్య తీరాలంటే వెల్లూరు, చిన్నమరి మధ్య కృష్ణ నదిపై డ్యాం నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్క ఎకరం ముంపు ముప్పు లేకుండా సుమారు 60 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే -మిగతా4లో..



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హాజరైన ప్రజలు

## కృష్ణా నదిలో బోటింగ్

**కొల్లాపూర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కృష్ణా నదిలో స్టీమర్‌లో బోటింగ్ చేశారు. ఈ ప్రాంతం ఎంతో పవిత్రమైనదని ఈ ప్రాంత అభివృద్ధికి జూపల్లి కృష్ణారావు ఎంతో కృషి చేశారని,అభివృద్ధికి ప్రభుత్వం తరపున ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఇందు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్కర్నూల్ ఎంపి మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, జిల్లా అధికారులు తదితరులు బోటింగ్‌లో పాల్గొన్నారు.



బోటులో ప్రయాణిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి జూపల్లి

## జూరాలకు పెరుగుతున్న వరద ఉధృతి



శ్రీశైల నుంచి విడుదలవుతున్న వరద

- ◆ 17 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- ◆ శ్రీశైలానికి 1.88లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ◆ 7 గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు2, ప్రభాతవార్త:** కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు జల కళను సంతరించుకున్నాయి. 17 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 1,80,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.148టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్‌కు 25,843క్యూసెక్కులు,స్పిల్ వే ద్వారా 1,39,132క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750,ఎడమ కాలువకు 1250క్యూసెక్కులు, కుడి కాలువకు 650క్యూసెక్కులు, సమాంతర కాలువకు600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,68,784 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది. శ్రీశైలం జలాశయానికి సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. దీంతో ప్రాజెక్టు 7గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్ హౌజ్ ద్వారా 25,843క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1,39,132క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 23046క్యూసెక్కులవరద జలాశయానికి చేరుకుంటున్నది.డ్యాం నుంచి 1,88,021 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.20అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 200.1971టీఎంసీలకు చేరింది. పవర్‌ఉత్పత్తి కోసం 66,102క్యూసెక్కులు విడుదల చేయగా కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. శ్రీశైలానికి కర్ణాటకలోకి ఆల్మట్టి,నారాయణపూర్ జలాశయాల నుంచి నిరంతరంగా నీటివిడుదల కొనసాగుతున్నది. ఉమ్మడి పాలమూరులోని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది.

## సెంట్రల్ లైటింగ్‌తో విశాలమైన రోడ్లు..

**మండల అభివృద్ధికై కృషి : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అమ్రాబాద్ మండల కేంద్రంలో విశాలమైన రహదారిని ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. మండల ప్రజలు ఇబ్బందులు పడవద్దు అనే ఉద్దేశంతోనే రోడ్ల విస్తరణ సెంట్రల్ లైటింగ్, అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. అమ్రాబాద్ గడ్డలో పుట్టిన వ్యక్తిగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంత ఋణం తీర్చుకుంటానని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యాంగా ముందుకు సాగుతానని గుర్తుచేశారు. కాబట్టి మండల ప్రజలు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎవరైనా కావాలని రాజకీయాలు చేసిపనులను అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తే సహించేది లేదని,చట్టప్రకారం చర్యలు తీసుకొని అభివృద్ధి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు హరి నారాయణగౌడ్, సీనియర్ నాయకులుబాల్ లింగంగౌడ్, తిరుమలయ్య, ముక్రం ఖాన్, రాజారాం, మల్లికార్జున్, రాజుగోపాల్, మనోహర్, సంతోష్, ఖైరత్, ఇతర సీనియర్ నాయకులు కార్యకర్తలు యువకులు , స్థానిక ప్రజలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# మీ త్యాగాల వల్లే సాగునీరు

- ◆ డిసెంబర్‌లోగా ఉదండాపూర్ నిర్వాసితులకు పూర్తి ప్యాకేజీ
- ◆ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ క్రింద రూ.175 కోట్లు మంజూరు
- ◆ మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల , ఆగస్టు2, ప్రభాతవార్త:** మీ త్యాగాల వల్లే ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఉదండాపూర్ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం 175 కోట్ల రూపాయల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని విడుదల చేసిందని వెల్లడించారు. ఈ మేరకు శనివారం జడ్చర్లలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్న మన జిల్లా ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నీటి పరిదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో ఈ నిధులను మంజూరు చేయించుకోవడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. డిసెంబర్ నెలలోపు మిగిలిన అన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను కంప్లీట్ చేస్తామని ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు హామీ ఇవ్వమని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఫోన్ చేసి తనకు తెలిపారని ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి తెలిపారు. మిగిలిన వారందరికీ కూడా ఇప్పటికే వచ్చేవి. కొంతమంది రాజకీయాల ఒత్తిడి వల్ల అభ్యంతరాలు తెలిపారు. ఈ కారణంగా అందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విడుదల కాలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2024 సెప్టెంబర్ లో 45కోట్లు,2025 జనవరిలో 30 కోట్లు మంజూరు కాగా. నారాయణపేట, కొల్లాపూర్ నియోజక వర్గ కేంద్రాలలో జరిగిన బహిరంగ సభల సందర్భంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లగా, ఇప్పుడు మళ్లీ నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 3న ఉదండాపూర్ నిర్వాసిత గ్రామాల ప్రజలు దాదాపుగా 6వేల మందితో సామూహిక భోజనాలను ఏర్పాటు చేశామన్నారు. నిర్వాసితులందరికీ ప్లాట్లు కేటాయించి సంవత్సరంన్నరలో ఇండ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేటట్లు చర్యలు చేపడతామన్నారు. భూముల నష్టపరిహారాన్ని పెంచే విషయం న్యాయస్థానం పరిధిలో ఉంది ఆ సమస్య కూడా త్వరలోనే పూర్తి అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాద్మి శివకుమార్, పట్టణ అధ్యక్షుడు మినాజ్, మాజీ ఎంపీపీ నిత్యానందం, కౌన్సిలర్లు ఉమాదేవి, చైతన్య చౌహాన్, రహీముద్దీన్, విజయ్, కుమ్మరి రాజు, శ్రావణి, రమేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి

- ● సెప్టెంబర్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలి
- ● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి




వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 2, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాంశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులందరూ పరీక్షలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు.శనివారం కలెక్టర్ కార్యాలయంలోని మిని సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లు,80 శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులుతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులుపాఠ్యాంశాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు, పరీక్షల భయం, వారిపై వారికి నమ్మకం లేకపోవడం వంటివి ఉందని. విద్యార్థులకు అర్థమయ్యేలా వారికి పాఠ్యాంశాలను నేర్పించాలని. విద్యార్థులకు బేసిక్స్ నేర్పించాలని. విద్యారులలో బాగా చదివే వారిని, చదవని వారిని గుర్తించి ఆవిద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని, బేసిక్స్ ను నేర్పించాలని. నిధానంగా నేర్చుకునే విద్యార్థులపై ఎక్కువ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు గణితం, సైన్స్, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టులలో వారికి పాఠ్యాంశాలనువారికి అర్థమయ్యేలా శ్రద్ధతో వారికినేర్పించాలన్నారు. సెప్టెంబర్ ఒకటి నుండి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు విద్యార్థులకు బ్లాక్ బోర్డు క్లాసులతో పాటు డిజిటల్ క్లాస్ రూమ్ ఐ.ఎఫ్.పి.ప్యానెల్ వంటివాటిని ఉపయోగించుకొని వారికి తరగతులను నిర్వహించాలని,టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ ను ఉపయోగించాలని, అపార ఐడి కార్డులు, విద్యార్థులకు వండే ఆహారాన్ని గ్యాస్ స్టవ్‌పై మాత్రమే తయారుచేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల టాయిలెట్స్,సిసిటీవీ కెమెరాలు, సైన్స్‌ల్యాబ్స్ ఏర్పాటునిర్మాణం, పాఠశాల, జూనియర్ కళాశాలల భవన నిర్మాణ పనులు, భవిత సెంటర్లు, అంగన్వాడి కేంద్రాలు, వంటి సంబంధిత అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డీఈఓ ప్రవీణ్ కుమార్, ఈడబ్ల్యూఐడిసి ఈఈ రామచంద్రం, సీఎంఓ బాలు యాదవ్, ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# గవర్నర్ చేత అవార్డు అందుకున్న నారాయణపేట కలెక్టర్

**సంపూర్ణత అభియాన్ సూచికలు వంద శాతం అందించారని అవార్డు**



గవర్నర్ చేత అవార్డు అందుకుంటున్న నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు2 ప్రభాతవార్త:** నీతి ఆయోగ్ సంపూర్ణ అభియాన్ (2024 జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు) లో భాగంగా నర్వ బ్లాక్ ఆరోగ్యం, పోషకాహారం, సామాజిక అభివృద్ధి (ఎస్‌హెచ్‌జి రివాల్వింగ్ ఫండ్)లోని ఆరు సూచికలలో ఐదు సూచికలను సంతృప్తపరిచినందున దీని కోసం నీతి ఆయోగ్ కీలక పనితీరు సూచికల సంతృప్తత ఆధారంగా జిల్లా కలెక్టర్లకు అవార్డులను ప్రకటించింది. అందులో భాగంగా నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఐ.ఏ.ఎస్ శనివారం రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వెండి పతకాన్ని అందుకున్నారు. సంపూర్ణత అభియాన్ సమయంలో నర్వబ్లాక్‌లో సంతృప్తమైన సూచికలు ప్రసూతి సంరక్షణ నమోదు రక్తపోటు స్క్రీనింగ్ డయాబెటిస్ స్క్రీనింగ్ గర్భిణీ స్త్రీలకు అనుబంధ పోషకాహార ఆహారాన్ని అందించడం స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజీని అందించడంలోనూ వంద శాతం సంతృప్తిగా ఉండటంతో అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శి, ప్రణాళిక సంఘం ప్రిన్సిపల్ కార్యదర్శి, సెర్ప్ సీఈవో పాల్గొన్నారు.

## ఉమ్మడి పాలమూరులో 8 మంది పంచాయతీ సెక్రెటరీల సస్పెన్షన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, వనపర్తి, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎనిమిది మంది పంచాయతీ సెక్రెటరీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే..వనపర్తి జిల్లా పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు విధులకు హాజరయ్యే సమయానికి ఇష్టానుసారంగా వ్యవహరించడం పట్ల జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పంచాయతీ సెక్రెటరీలను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా అధికారి రఘునాథ్ రెడ్డి తెలిపారు. పలుమార్లు ఫేక్ అటెండెన్స్ చేయొద్దని ఫిజికల్‌గా ఉండి ఫోటో అప్లోడ్ చేయాలని ఎన్నోసార్లు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని గతంలో ఉన్నటువంటి యాప్ పాత పద్ధతి ప్రకారంగానే ఫోటోక్యాప్చరింగ్ చేసి అప్లోడ్ చేస్తున్నారని అలా చేయొద్దని కొత్తగా వచ్చిన యాప్‌లో ఫేక్ అటెండెన్స్ చేసినట్లయితే తెలిసిపోతుందని పలుమార్లు హెచ్చరించిన జిపి సెక్రెటరీ మానకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఏదుల మండలం రేకులపల్లి తండా, గోపాల్పేట్ మండలం ఏదుట్లగ్రామం,పానగల్ మండలంలోని షాగాపూర్ తాండ, పెబ్బేరు మండలంలోని కొత్త సూగురు గ్రామపంచాయతీ. మదనాపూర్ మండలంలోని గోపన్ పేట్,అమరచింత మండలంలోని నందిమల్ల జిపి సెక్రటరీ తో కలిపి 6మందిపై సస్పెన్షన్ వేటు పడినట్లు డిపిఓ తెలిపారు. అదే విధంగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని ఇద్దరుపంచాయతీ కార్యదర్శులనుసస్పెండ్ చేస్తూ ఉత్తర్వులుజారీ చేసిన జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

**ఆపరేషన్ ముస్కాన్ 11లో 56 మంది బాలలకు విముక్తి**
**బాలలను పనిలో పెట్టుకున్న 20 మందిపై కేసులు నమోదు**
**బాల కార్మికులను గుర్తించి హెల్ప్ లైన్ 1098 సమాచారం ఇవ్వాలి : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్**



**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు2 ప్రభాతవార్త:** బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన వదిలివేయబడిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్‌లలో, మెకానిక్ షాపులలో,ఇటుక బట్టీలలో, హోటళ్లలో,వివిధ కంపనిలలో పనిచేస్తూ మరియు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగు తుందని దానిలో భాగంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్11 కార్యక్రమం జిల్లాల పోలీస్ అధికారులు,సిబ్బంది మరియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్,ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్, వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసిం దని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. జులై 1 నుండి 31 వరకు ముస్కాన్ ఆపరేషన్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించి 56 మంది బాల కార్మికులను పట్టుకోవడం జరిగింది. అందులో 48 బాలురు,08 మంది బాలికలను పట్టుకోగా అందులో 16 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన బాల కార్మికులు ఉన్నారు. మొత్తం 20 కేసులు నమోదు చేయడం జరిగిందని బాల కార్మికులుగా ఉన్న పిల్లలకు, తల్లిదండ్రులకు పాఠశాలలోచేర్చే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని ఆది ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి, బాల కార్మిక వ్యవస్థ నిర్ములన కోసం బాధ్యతాయుతంగా కృషిచేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్ మరియు ముస్కాన్ కార్యక్రమాలను -మిగతా4లో..

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

**ఆత్మకూర్ ఆగస్టు2, ప్రభాతవార్త:** సమాజంలో ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమై ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న విషయాన్ని గుర్తించి వనపర్తి జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆత్మకూరు ఎస్సై నరేందర్ తెలిపారు. అందులో భాగంగానే శనివారం రోజు పట్టణంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో సైబర్‌నేరాలపై ప్రజలకు విశేష అవగాహన కల్పిస్తూ తగు జాగ్రత్తలు మరియు సూచనలు చేశారు అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తూ ఓటీపీ చెప్పాలంటూ డబ్బులు చెల్లిస్తామని ఆశలు రేకెత్తిస్తారని ఈ విషయాన్ని తక్షణమే 1930 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో సైబర్‌నేరాలు కేవలం పెద్ద పెద్ద నగరాలకే పరిమితమయ్యేవని ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించి ప్రజలను దోపిడీ చేసేందుకు పలురకాలుగా ప్రయత్నాలు కొనసాగిస్తారని ఈ విషయం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ హెడ్ కానిస్టేబుల్ గుప్తా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**భూత్పూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** విద్యార్థిని విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తమై ఆరోగ్యంగా ఉండాలని అన్నాసాగర్ పల్లె దవాఖానా వైద్యురాలు డాక్టర్ రాధిక అన్నారు. శనివారం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధిక మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల అవగాహన, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. భోంచేసే ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

## నేడు బాలజంగయ్య మూడో వర్ధంతి సభ

**ఉప్పునుంతల, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అమరుడు పడాల బాల జంగయ్య మూడో వర్ధంతి సభ నేడు అచ్చంపేట పట్టణంలో నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధులు తెలిపారు. వర్ధంతి వేడుకలకు ప్రొ॥ హరగోపాల్, ప్రొ॥ లక్ష్మీనారాయణ లు హాజరవుతున్నారని మహబూబ్‌నగర్ రాజకీయ ఆర్థిక నేపథ్యం, విద్యా రంగం వర్ధమాన పరిస్థితులు అనే అంశంపై వర్ధంతిసభ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా చంద్ర సాగర్, అమ్రాబాద్ ఎత్తిపోతల వెంటనే చేపట్టాలని స్పందన, బాలజంగయ్య మిత్రులు పేర్కొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**మల్దకల్ ఆగస్టు2. ప్రభాతవార్త :** మల్దకల్ మండల కేంద్రంలో శనివారం నేడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత కస్తూరిబా స్కూల్లో పాఠశాల మల్దకల్‌నందు మరియు కేజీబీవీ మల్దకల్ నందు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనై జేషన్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు తెలుగు హిందీ ఆంగ్లం విషయాలకు సంబంధించిన హెల్పింగ్ హాండ్స్ మెటీరియల్‌ను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మండల విద్యాధికారి జి సురేష్ మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని కోరడమైనది. హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ ఆర్గనైజర్స్ రత్న సింహారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు తమవంతు సహాయంగా ఈ సంవత్సరం హెల్పింగ్ హాండ్స్ మెటీరియల్ అందజేస్తున్నామని ప్రతి విద్యార్థి మెటీరియల్ లను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన ట్రస్టు సభ్యులు రత్న సింహారెడ్డిని మండలవిద్యాధికారి జిసురేష్ పాఠశాల తరఫున సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు స్థానికమండల విద్యాధికారి జి సురేష్, హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజర్ రత్నసింహారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లను ఫ్రీ ప్రైమరి టీచర్స్‌గా తీసుకోవాలని మంత్రి సీతక్కకు వినతి



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, అంగన్వాడీ అసోసియేషన్ సభ్యులు

**గద్వాల, ఆగస్టు2, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని శిశు సంక్షేమ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి సీతక్క అనసూయను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం త్వరలో తేబోతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్రీ ప్రైమరీ పాఠశాల నిర్వహణ కోసం ఫ్రీ ప్రైమరి టీచర్స్ గా అంగన్వాడీ టీచర్లను తీసుకోవాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. గత 50 సంవత్సరాలుగా అంగన్వాడీ ఉద్యోగులుగా గౌరవ వేతనంతో పనిచేస్తూ ప్రభుత్వము ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలోకి తీసుకెళ్లడమే కాకుండా అనేక అదనపు ప్రభుత్వ కార్యక్రమాలను చేస్తున్నారనీ, ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ప్రభుత్వ పాఠశాలలో ఫ్రీ ప్రైమరి పాఠశాలల నిర్వహణకు వేరేవాలంటీర్లను నియమించడం కోసం జిఓ ను తేవడం జరిగిందని దానిని రద్దు పరచాలని మంత్రిని కోరారు. అంగన్వాడీ ఉద్యోగులు డిగ్రీలు, పీజీలతో పాటు ప్రీ స్కూల్ ట్రయినింగ్లు, జాబ్ కోర్స్ అర్బీ ట్రైనింగులు, ప్రీ స్కూల్ కార్యక్రమాల మీద పూర్తి అవగాహనా ఉన్నందున అర్హులైన అంగన్వాడీ ఉద్యోగులను నియమించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క తదుపరి కార్యాచరణను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణఅంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు సౌధామిని, ఇందిరమ్మ, శ్రీలత, అనంత లక్ష్మి, సువర్ణ, వెంకట లక్ష్మి, శైలజ, సుజాత పాల్గొన్నారు.

## 5న జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలి

**ఇటిక్యాల, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకుగాను ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల ఆగస్టు 5 మంగళవారం తలపెట్టిన ఉపాధ్యాయులధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభాకర్ శాస్త్రి. ఉదయ్ కిరణ్. కావాలి మన్యం. తదితరులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను అలాగే 30 డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఆ దిశగా ఉపాధ్యాయ సంఘాల పోరాటంలో భాగంగా 5 వ తేదీ మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో తలపెట్టిన ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా 317 బివీ స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపాలని సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని పెండింగ్లో ఉన్నడి ఎపిఆర్‌సిని వెంటనే ప్రభుత్వం ప్రక టించాలన్నారు. అలాగే రిటైర్ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని రిటైమెంట్ బెనిఫిట్స్‌లను వెంటనే విడుదల చేయాలనిపాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపా యాలు కల్పించాలని 5571 హెచ్‌ఎంల పోస్టులు మంజూరు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశా లలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని. జిల్లాలకు డీఈఓ పోస్టులను, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ డిఈవో పోస్టులను, మండలానికి ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని. గురుకుల పాఠశాలలకు టైం టేబుల్‌ను శాస్త్రీయంగా సవరించి, ఉపాధ్యాయులకు విద్యార్థులకు న్యాయం చేయాలి. అంతేకాక కేజీబీవీ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్. సర్వ శిక్ష అభియాన్ ఉద్యో గులకు బేసిక్ పే అమలు పదోన్నతులు వంటి పలుడిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేదాక పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్‌జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ శాస్త్రి.. జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఉదయ్ కిరణ్. జిల్లా ఉపాధ్యక్షులు కావలిమన్యం, దయాకర్, బీసన్న, యుటిఐ జిల్లా కార్యదర్శి తిమ్మప్ప, ఉపాధ్యాయ సంఘం రాజశేఖర్, కరుణాకర్ విజయ్ ఎర్రవల్లి మండల్ అధ్యక్షులు, రాంబాబు పాల్గొన్నారు.

## గురుకులంలో కలెక్టర్ తనిఖీ

- భూత్పూర్ ఎంజెపి బాలికల గురుకుల పాఠశాల తరగతి గదులు, కిచెన్, వంట సామాగ్రిని పరిశీలించిన కలెక్టర్
- ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



టెన్త్ క్లాస్ గురుకుల బాలికలతో ముచ్చటిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి



ఐదో తరగతి బాలికలు గీసిన డ్రాయింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**భూత్పూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోనఅ అమిస్తాపూర్ సారిక టౌన్‌షిప్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను శనివారం మధ్యాహ్నం కలెక్టర్ విజయేంద్రబోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ నేరుగా భౌతిక శాస్త్రం జరిగే పదోక్లాసు గదిలోకి వెళ్లి విద్యార్థినుల పాఠాల ను అడిగి తెల్సుకున్నారు. టెన్త్ తర్వాత మీ గోల్ ఎంటని విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెల్సుకున్నారు. అనంతరం ఐదోతరగతి గదికి వెళ్లి నూతనంగా వివిధ పాఠశాలల నుంచి కొత్తగా వచ్చి అడ్మిషన్లు పొందిన విద్యార్థినుల వివరాలను కలెక్టర్ అడిగి తెల్సుకున్నారు. ఐదోక్లాస్ బాలిక గీసిన డ్రాయింగ్‌ను కలెక్టర్ చూసి విద్యార్థిని అభినందించారు. అనంతరం గురుకుల స్టోర్‌రూమ్, కిచెన్, డైనింగ్‌హాల్, డార్మిటరీలను పరిశీలించి ఇక్కడి మెనును అడిగితెల్సుకున్నారు. విద్యార్థినులకు అందించే వంటకాలను గురుకుల ప్రిన్సిపాల్ సుగుణశ్రీని అడిగితెల్సుకున్నారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, నిత్యావసర సరుకులను పరిశీలించారు. గురుకుల మెను బోర్డును పరిశీలించి మెనుకు అను గుణంగా భోజనం అందిస్తున్నదీ లేనిదీ విద్యార్థినులను అడిగిఆరాతీ శారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణంలో భోజనంతయారు చేయాలని, ఆహారం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నిర్వహకులకు సూచించారు. గురుకుల నిర్వహణపై కలెక్టర్ విజయోంద్రబోయి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు గురుకుల ప్రిన్సిపాల్ సుగుణశ్రీ తెలిపారు.





బాలికల గురుకుల వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి

## సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున సిపిఐ నాయకులు

**గద్వాల టౌన్ ఆగస్టు 2, ప్రభాతవార్త:** భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా3వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన వాల్మీకి భవన్ గద్వాల పట్టణంలో జరిగే సిపిఐ జిల్లా3వ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడిదారులతో చేతులు కలిపి దేశంలో సంపదను దోచిపెట్టి దేశానికి తీవ్ర నష్టం సంక్షోభం వాటిల్లే విధంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశ ఐక్యతకు, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు బీజేపీ కేంద్ర పాలకులు తీరనిహాని తలపెట్టి, ప్రజల మధ్య కులాల, మతాల పేర్లతోఅల్లర్లను రేకెత్తిస్తున్నారనీ మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ వంటి నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తుందని ఆవేదనచెందారు. అదేవిధంగా కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో 7లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలను, రైతులను అనేక ఇబ్బందికర పరిస్థితులకు గురి చేశాడని, దీనితో ప్రజలు ఈపరిస్థితుల నుంచి బయట పడటానికి కేసీఆర్ ప్రభుత్వం నీ ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తే, ఈ ప్రభుత్వం కూడా ప్రజలకుఇచ్చిన హామీలను నెరవేర్చడంలోవిఫలం అయిందన్నారు. ఈ సమస్యలు పరిష్కారం కావాలంటే, ప్రజలలో చైతన్యం తీసుకురావాలని అందుకోసమే సిపిఐజిల్లా మహాసభలను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు, రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐనాయకులు జిల్లాసమితి సభ్యులు జి రంగన్న, గద్వాల మండల కార్యదర్శి ఖాసిం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఏఐటియూసి జిల్లా నాయకులురవి, రామాంజనేయులు, తిమ్మప్ప, గోకారి పాల్గొన్నారు.

## భావితరాలకు కాలుష్యరహిత సమాజం అందించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ సైదులు

**ఆత్మకూర్ ఆగస్టు2, ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో కాలుష్యం పెరిగి పలు రోగాలకు గురవుతున్న విషయాన్ని గుర్తించి భావితరాల వారికి కాలుష్యరైత సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సైదులు సీనియర్ ఉపాధ్యాయులు టీజే విశ్వేశ్వర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులు కళాశాల అధ్యాపక బృందం కలిసి భారీగా చెట్లు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సైదులు మాట్లాడుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా కాలుష్యం పెరిగి లాంటి ప్రధాన నగరంలో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న విషయాన్ని విద్యార్థిని విద్యార్థులు బాధ్యతగా గుర్తిరిగి తల్లిదండ్రుల పేరుమీద మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచాలని ఆయన సూచించారు. చెట్లు నాటితేనే భవిష్యత్ తరాలకు ఆయుష్ పెరుగుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిం చాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపక బృందం భాగ్య వర్ధన్ రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డైరెక్టర్ కురుమూర్తి విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక హక్కులు పెట్టుబడిదారులకు తాకట్టు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయలక్ష్మి
- జడ్చర్లలో సిఐటియు జిల్లా శిక్షణ తరగతులు




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయలక్ష్మి

**జడ్చర్ల టౌన్, ఆగస్టు2 ప్రభాతవార్త:** తమ ప్రాణాలను పణంగా పెట్టి అవిశ్రాంతంగా పోరాడి కార్మికులు సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయలక్ష్మి అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళా భవనంలో రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజుశిక్షణ తరగతులను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయలక్ష్మి ప్రారంభించి మాట్లాడుతూ కార్మిక ఉద్యమ చరిత్ర సిఐటియు విశిష్టతను వివరించారు. భారత స్వతంత్ర ఉద్యమంలో కార్మికులు ముందుభాగాన ఉండి పోరాటాలు చేశారన్నారు, స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా కార్మికులు తమ కనీస వేతనాల కోసం, ఉపాధి, భద్రత కోసం పోరాడి అనేక హక్కులను సాధించుకొన్నారని గుర్తు చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను చట్టాలను నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చిపెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు తాకట్టు పెట్టేసిందన్నారు. భవిష్యత్తులో కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడి యజమానులు చెప్పిందే వేదంగా పనిచేయాల్సిన పరిస్థితిని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తుందనీ అన్నారు. కార్మికులు సంఘాలను పెట్టె స్వేచ్ఛనుపూర్తిగా కోల్పోతారనీ, వేతనాలు, పని గంటలు సంబంధం లేకుండా యజమానులు ఎలాచెప్తే అలా పని చేయాల్సి వస్తుందని, పాలకులు పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడడానికి మాత్రమే ఈ లేబర్ కోడ్లను తీసుకువస్తున్నారు తప్ప కార్మికుల ప్రయోజనాల కోసం ఎంత మాత్రం కాదన్నారు. పార్లమెంట్లో పెట్టుబడిదారులు చొరబడిన తర్వాత కార్మికులకు, కర్షకులకు, పేదలకు ప్రయోజనం పొందే పథకాలు లేకపోగా పేదలను ఎలాదోచుకొని పోవాలని ఆలోచిస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో కార్మికులు, కర్షకులు, పేదలు చైతన్యమై పోరాటాలకు సిద్ధం కాకపోతే భవిష్యత్తు అంతా అంధకారంలోకి నెట్టబడుతుందని, పెట్టుబడిదారీ ప్రభుత్వాలను ఇంటికి పంపించే కర్తవ్యాన్ని కార్మికులు పేదలు తీసుకొని, భవిష్యత్తులో మిలటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని, ఈ ప్రభుత్వం ఇప్పటికైనా తన విధానాలను మార్చుకొని, కార్మిక కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను, వారి హక్కులను యధావిధిగా అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేసారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, జిల్లా కోశాధికారి చంద్రకాంత్, నాయకులు రాజ్ కుమార్, తిరుమలయ్య, వసియాబేగం, ఖమర్‌అలీ, అంగన్వాడి, ఆశ, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్నం భోజన ఏజెన్సీ కార్మికులు, వివోఏలు, సంఘాల నాయకులు, కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెల్టూర్‌లో రేషన్ కార్డుల పంపిణీ



వెల్టూర్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తున్న నాయకులు

**ఉప్పునుంతల, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిం చడం జరుగుతుందని, పేదోడి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల రేషన్ షాప్ నెంబర్ 2, వెల్టూర్‌లో మంజూరైన రేషన్ కార్డులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజా ప్రభుత్వమని అన్నారు. నాడు ఇందిర గాంధీ నేడు రేవంత్ రెడ్డిలు ప్రజా సంక్షేమానికి వేస్తున్నారని పలువురు కొనియాడారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి ధనార్జనే ధ్యేయంగా పనిచేశారని అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి, బిసి సెల్ మండల అధ్యక్షుడు మడ్డి తిరుపతయ్యగౌడ్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, పెద్ది రెడ్డి బూషి రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాపి శెట్టి కుమార స్వామి, బృంగి గోపాల్, వెల్టూరు లో మాజీ సర్పంచులు గున్నమోని లింగమయ్య యాదవ్, రాగి వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, రేషన్ డీలర్ బూసిరాజు మల్లయ్య, స్థానికులు గుడ్డటి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొన్నగంటి బాల్ రెడ్డి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ లింగమయ్య, మాజీ ఉపసర్పంచ్ దుళ్ళ శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్‌అజీమొదీన్, అర్జునయ్య, శ్రీను, పార్వతమ్మ, గోస్కె బాలరాజు, నాగార్జున గౌడు, మహేష్, జంగి రెడ్డి, కళావతమ్మ, గణేష్, జంగయ్య, జమీల్, కార్తీక్ రెడ్డి, తిరుపతయ్య, రాజు, ఇదమయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

**చిన్న చింతకుంట, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న స్థానిక దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు దేవస్థాన కమిటీ సభ్యులు ముందుకు రావాలని ఎస్ఐ రామ్‌లాల్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయాగ్రామాల్లోని దేవాలయాలలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని దీని దృష్టిలో ఉంచుకొని దేవాలయాలలో స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల గుర్తు తెలియని వ్యక్తుల సంచారాన్ని గుర్తించి దొంగతనాలను అరికట్ట వచ్చు న్నారు. దేవస్థాన కమిటీ సభ్యులకు ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకి అంతరాయం

**బాలానగర్, ఆగస్టు2 ప్రభాతవార్త:** బాలానగర్ మండల విద్యుత్ వినియోగదారులకు సూచన. ఈరోజు ఉదయం అనగా 03/08/2025 రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బాలానగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు ఉన్న సందర్భంగా (కొత్త బ్రేకర్ )పెట్టడం కోసం బాలానగర్ సబ్ స్టేషన్ పరిధిలో గల బాలానగర్, నేరెళ్లపల్లి, గుండేడు, గౌతపూర్, కేతిరెడ్డిపల్లి, పెద్దాయపల్లి, రంగారెడ్డిగూడ, నందారం, బోడ జానం పేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని, కావున పశువులకి, గృహ అవసరాలకి ముందస్తుగా నీళ్లు పట్టుకోగలరని బాలానగర్ విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

## ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి నిధులు విడుదల

**దామరగిద్ద, ఆగస్టు2 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలో కిసాన్ సమ్మాన్ నిధి కింద, అర్హులైన రైతులు వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి రూ.6,000 జమ చేస్తారు. భారత ప్రభుత్వంచే పూర్తిగా నిధులతో, పీఎంకిసాన్ రైతుల జీవనోపాధిని బలోపేతం చేయడానికి మరియు వ్యవసాయ వృద్ధిని ప్రోత్సహించడానికి సకాలంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడతలో భాగంగా 9.7 కోట్ల రైతుల ఖాతాల్లో20.500కోట్ల నిధుల విడుదల సందర్భంగా దామరగిద్ద రైతు వేదికలో వ్యవసాయ అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రధానమంత్రి సందేశ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల ఏవో మనిచందర్, ఏఈఓలు, బిజెపి మండల సీనియర్‌నాయకులు గోపాల్‌రావు, సత్తీ సత్య నారాయణ, యువ నాయకుడు సింగారం ఆంజనేయులు, వెంకటేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ పై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణ జాగృతి సేన నారాయణపేట జిల్లా నాయకులు శ్రీధర్




మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి సేన నారాయణపేట జిల్లా నాయకులు శ్రీధర్

**నారాయణపేట టౌన్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌అమలుపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ జాగృతి సేన నారాయణపేట జిల్లా నాయకులు శ్రీధర్ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజం అంటేనే బీసీలు.. బీసీల సంక్షేమమే అభివృద్ధి అన్నారు. రిజర్వేషన్ అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వకుండా బీసీలకు ద్రోహం చేయడమే అన్నారు. రిజర్వేషన్ అమలు బీసీల ఆత్మగౌరవమన్నారు. బీసీ రిజర్వేషన్ అమలుపై ఈనెల4,5,6 తేదీలలో తెలంగాణ జాగృతి, జ్యోతి రావు పూలే బీసీ ఫ్రంట్ ఉమ్మడి ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల కవిత 72 గంటల పాటు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందన్నారు. ఇట్టి కార్యక్రమానికి బీసీ నాయకులు అంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సేన నాయకులుతిరుపతి, మైనుద్దీన్‌తో బాటు తదితరులు ఉన్నారు.

## మై భారత్ ఆధ్వర్యంలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమం




**ఊట్కూర్, ఆగస్టు2 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన " ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమాన్ని ఉట్కూరు మండలంలోని ఎడవల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు పై ఒక మొక్కను నాటాలని మై భారత్ డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ కుమార్‌గౌడ్ అన్నారు, అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మై భారత్ డైరీలను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు కల్పన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చాలా అభినందనీయమని మైభారత్‌ను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, ప్రవళిక, నరేష్ ,సోహెల్, స్వరూప్ రాజ్, వెంకట్ రాములు , యువశక్తి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శిశువులకు ముర్రుపాలు తాగించాలి

### తల్లిపాల వారోత్సవాల్లో సిడిపిఓ దమయంతి

**ఉప్పునుంతల, ఆగస్టు 2 ప్రభాతవార్త :** శిశువు జన్మించిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే త్రాగించాలని ఐసిడిఎస్ బల్మూర్ ప్రాజెక్ట్ సిడిపిఓ దమయంతి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల భాగంగా రెండవ రోజైన శనివారం మండలంలోని పెద్దాపూర్ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి సిడిపిఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా వైద్య అధికారి డాక్టర్ అభిలాష్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్పుఅయిన మొదటి కొద్దిరోజులు తల్లిపాలు చిక్కగా ఉంటాయని, పసుపు రంగులో ఉంటాయని వీటిని ముర్రుపాలు, కొలెస్ట్రామ్ అంటారని, ఇందులో ప్రోటీన్లు, రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఎక్కువగా ఉంటుందని వీటికి తోడు ఏబిలతో పాటు తగినంత ఐరన్ ఉంటుందని ముర్రుపాలు బిడ్డకు సంజీవని అన్నారు. తల్లిపాలు తేలికగా అరుగుతాయని, ఇవి శుభ్రంగా, ఎటువంటి క్రిములు లేకుండా ఉంటాయన్నారు. తల్లిపాలు శిశువుని శ్వాసకోసవ్యాధులు, అలర్జీలు, అస్తమా, చర్మ వ్యాధుల నుంచి రక్షిస్తాయని వైద్యాధికారి డా. అభిలాష్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ బల్మూరు ప్రాజెక్ట్ సిడిపిఓ దమయంతి, డా. అభిలాష్ కుమార్, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ పార్వతి, పంచాయతీ కార్యదర్శి రూప్ సింగ్, అంగన్‌వాడి కార్యకర్తలు కొత్త శ్రీలత, నీరంజనమ్మ, వైద్య సిబ్బంది కళావతి, లక్ష్మి ఆశా కార్యకర్తలు, పిల్లల తల్లులు, బాలింతలు, గర్భవతులు, చిన్నారులు పాల్గొన్నారు.




తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సిడిపిఓ దమయంతి

## 42 శాతం రిజర్వేషన్‌కై అన్ని పార్టీలు కలిసి రావాలి

■ బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్



మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు2 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో బీసీ జాగృతి సేన ముఖ్య నాయకుల సమావేశంలో బీసీజాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతు బీజేపీ పార్టీ ఓబీసీ మోర్చా విభాగం నాయకులు ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేపట్టడానికి బదులు పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని చేపడితే బీసీ రిజర్వేషన్లను పెంచడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగేదని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ల అంశంపై అన్ని రాజకీయ పార్టీలు దూకుడుగా పోటాపోటీగా దీక్షలు,ధర్నాలు చేపడుతున్నాయి కానీ, ఆయా పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ప్రస్తుతం నడుస్తున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ఎందుకు చర్చ లేవనెత్తడం లేదని ప్రశ్నించారు, ధర్నాలు చేపట్టి మేము బీసీల పక్షపాతమని మొసలి కన్నీరు కారిస్తే సరిపోదని, 42శాతం రిజర్వేషన్ అమలు కై అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంటును ముట్టడి కార్యక్రమాలు చేపట్టి రిజర్వేషన్ల పెంపకం కేంద్రాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. బీసీ నినాదం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే కాలం చెల్లిపోయిందని బీసీల భావోద్వేగాలతో చెలగాటమాడే రాజకీయ పార్టీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పుట్టగతులుండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య, నియోజకవర్గం అధ్యక్షులు గణేష్ ముదిరాజ్, బీసీ ఐక్యవేదిక మరికల్ మండల అధ్యక్షులు పోలేమాని శ్రీనివాస్ ముదిరాజ్, దామరగిద్ద మండల అధ్యక్షులు గజలప్ప, దత్తు, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు.
తదితరులు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**దేవరకద్ర, ఆగస్టు 2 ప్రభాతవార్త:** నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలా మారిందని, ప్రతి ఒక్కరు సీఎం రిలీఫ్ ఫండ్ ను వినియోగించుకోవాలని గుడిబండ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గుడిబండ గ్రామానికి చెందిన గుజ్జుల సత్తన్నకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డికి గుజ్జుల సత్తన్న కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌని అమరేశ్వర్ రెడ్డి, గౌని జైపాల్ రెడ్డి, ఎం.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్ రెడ్డి, ఏ.శ్రీనివాసరెడ్డి, ఎం.నరసింహులు, వేణాచారి తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ వైద్య శిబిరం విజయవంతం




పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట్ టౌన్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణ్ పేట్ గీత మల్టీ స్పెషాలిటి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కిడ్నీ, మూత్ర సంబదింత వ్యాధులపై నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో భాగంగా 110మందికి కిడ్నీ శాస్త్రచికిత్స నిపుణులు వివేకానంద్ పర్యవేక్షణలో చికిత్సలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులు పాటించవలసిన నియమాలపై సూచనలు ఇచ్చారు. అంతకు ముందు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ స్త్రీ వైద్య నిపుణురాలు గీతా విశ్వనాధ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్, శస్త్ర చికిత్స నిపుణులు విశ్వనాధ్, కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రాధ, సదానంద్ చారి, ఆత్మరాం, ఏడికే శ్రీనివాస్, లాహోటి బీం చందర్, గౌడ్ కన్న జగదీశ్ జనార్ధన్, డా. ధౌసిప్ రామకృష్ణ, అన్వర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

**వెల్దండ, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ జన్మదిన వేడుకలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవిలు పాల్గొని మోతిలాల్‌నాయక్, కేశమల్ల కృష్ణకు శాలువాలు కప్పి వారిచేత కేకు కట్ చేపించి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీబీ మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి, పర్వత్ రెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, తక్కలపల్లి శేఖర్, చేర్క రాజశేఖర్, రషీద్, అలీ, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, నారాయణ,శంకర్ నాయక్, పోలే రాజు, ఎర్ర శీను, రమేష్, పురుషోత్తంచారి, సతీష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన తహసీల్దార్




కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్ సుందర్‌రాజ్

**దేవరకద్ర, ఆగస్టు 2 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని రాజోలి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తాహసిల్దార్ సుందర్ రాజ్ మరియు కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర యూత్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్ మాట్లాడుతూ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడం ప్రజాపాలన ఉద్దేశం అన్నారు. పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఉన్నదని, మహిళలు ఈ డబ్బులను వృధా చేయకుండా అవసరానికి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజోలి గ్రామ పార్టీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ సంరక్షణ కోసం బిజెపి తలపెట్టిన పాదయాత్ర అడ్డుకోవడం తగదు

■ బిజెపి మండల అధ్యక్షులు గువ్వని నవీన్



ముందస్తుగా లింగాల బిజెపి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

**లింగాల, ఆగస్టు2 ప్రభాతవార్త:** ప్రసిద్ధి చెందిన ఉమామహేశ్వర ఆలయంలో అవినీతి, అక్రమాలు జరుగుతుందని, బిజెపి తలపెట్టిన పాదయాత్రను పోలీసులు బిజెపి కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం తగదని బిజెపి మండల ధ్యక్షులు నవీన్ అన్నారు. ఈ సందర్భంగా బిజెపి మండ లధ్యక్షులు గువ్వని నవీన్ మాట్లాడుతూ శనివారం రంగపూర్ నుంచి ఉమామహేశ్వర ఆలయం వద్దకు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్రను చేపట్టారు. పోలీసులు పాదయాత్రకు వెళ్ళడానికి సిద్ధమవుతున్న లింగాల బిజెపి కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేయడం తగదన్నారు. ముఖ్యంగా ఉమామహేశ్వర ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమంగా జరుగుతున్న దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆలయం కొండపైకి రోడ్డు సౌకర్యం రోడ్డు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. దైవదర్శనం కోసం భక్తులు రోజు రోజుకు పెరుగుతుండటంతో కావలసిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి సలేశ్వరం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డా. టి రాంప్రకాష్

**బిజినేపల్లి, ఆగస్టు2 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న రైతు అభివృద్ధి, సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డా. టి. రాంప్రకాష్ అన్నారు. పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పీఎం కిసాన్ సమ్మన్ యోజన నిధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏడీఆర్ డా.టి.రాం ప్రకాష్ హాజరై మాట్లాడారు భారతదేశంలోని ప్రతి రైతు అవసరానికి తగ్గట్లుగా వివిధ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ రైతాగాని ప్రోత్సహిస్తుందని చెప్పారు. ప్రధానంగా డ్రోన్ నిధి రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మంచి సాగుపద్ధతులను అవలంబించి ఎప్పటికప్పుడు నూతన వ్యవసాయ పద్ధతులతో సాగును చేపట్టి ఆర్థికంగా ఎదగాలన్నారు. యాంత్రికరణ పద్ధతులను పాటించి కూలీల కొరతను అధిగమించాలన్నారు. పీఎం కిసాన్ సన్మాన్ యోజన కింద రైతులకు నిధులు విడుదల చేసింది అని దేశ ప్రధాని నరేంద్ర మోదీ 20వ విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేశారని చెప్పారు. కెవికె కోఆర్డినేటర్ డా. పి. శ్రీదేవి మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ యోజన పథకం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు. నంది వడ్డెమాన్ రైతు చంద్రయ్య, ఎత్మతాపూర్ మహిళా రైతులక్ష్మి, పీఎం సన్మాన్‌నిధి యోజన పథకం యొక్క లబ్ధిని తోటి రైతులకు వివరించారు. గ్రామీణ ప్రాంత రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకునిసాగు ఖర్చును తగ్గించుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. యశ్వంత్ రావు మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మన్ యోజన నిధి ద్వారా రూ. 20వేల కోట్ల నిధులను ఆయన విడుదల అయ్యాయని తెలిపారు. ఇందులో దేశవ్యాప్తంగా 9.70కోట్ల రైతుల ఖాతాల్లోని నిధులు జమ చేసనట్లు వివరించారు. అర్హులైన రైతుల ఖాతాలలో కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6 వేలనుజమ చేస్తుందన్నారు. ఈ సొమ్ము ను రూ.2 వేలుచొప్పున మూడు విడతలుగా విడుదల అయినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడిఏ పూర్ణచందర్ రెడ్డి ఏవో కమల్ కుమార్ దేశి ప్రోగ్రాం ఫెసిలిటేటర్ కృష్ణయ్య, రావేపు విద్యార్థులు దేశీ ఇన్పుట్ డీలర్సు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రైతులు, అధికారులు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమం



మొక్కలను నాటుతున్న విద్యార్థులు, అధ్యాపక బృందం

**పెబ్బేరు, ఆగస్టు2 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేరులో వన మహోత్సవం పురస్కరించుకుని అధ్యాపకులు బోధనేతర సిబ్బంది కళాశాల విద్యార్థిని విద్యార్థులు కలిసి కళాశాల మైదానంలో,వివిధ రకాల పండ్ల చెట్లను, పూల మొక్కలను, వివిధ ఇతర రకాల మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జిప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాల మైదానంలో చెట్లను నాటడం వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. చక్కటి వాతావరణంతో పాటు,మంచి ఆక్సిజన్‌లభిస్తుంది, పచ్చని చెట్ల వల్ల మనమందరం ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని, ఆయా సీజన్లో మంచి పండ్లు కాస్తాయని వాటిని తినడం వల్ల మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. చెట్లు కళాశాల ప్రాంగణంలో ఉండడం మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండి చదువుకోడానికి బాగుంటుందని తెలిపారు. చెట్లు నాటే కార్యక్రమంలో ఇంచార్జిప్రిన్సిపల్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు కృష్ణకుమారి, హనుమంత్ రెడ్డి, కృష్ణయ్య, జ్ఞానేశ్వర్ రెడ్డి, నవీన్ కుమార్, జాకీర్‌హుస్సేన్, వెంకటలక్ష్మి, శిల్ప,బోధ నేతర సిబ్బంది కరుణాకర్, విమలాదేవి, వెంకటేష్, మద్దిలేటి, వేణు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**చిన్నచింతకుంట, ఆగస్టు2 ప్రభాతవార్త:** ప్రజా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కౌకుంట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాదిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు .శనివారం స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు పిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి తో కలిసి మండలంలోని తిరుమలాపూర్, దాసరిపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమన్వయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందించిన పథకాలను ఇంటింటికీ చేర్చేలా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఆయా గ్రామంలో ఇంకా ఉన్న సమస్యలను తమకు తెలుపాలని అట్టి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త ఇప్పటినుంచే పనిచేయలన్నారు. ఈ సమావేశంలో కురుమూర్తి స్వామి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి రెడ్డి , కురుమూర్తి స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ విజయ సారథి రెడ్డి ,ఓబీసీ అధ్యక్షులు ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్‌కుమార్,రామ్మోహన్‌రెడ్డి, దాసరపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుమలాపూర్ గ్రామ పార్టీ అధ్యక్షులు మండల నాగన్న, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

## సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం



**మక్తల్ టౌన్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడారంగంలో అత్యున్నత స్థాయిలో నిలబట్టే దిశగా తెలంగాణ క్రీడా విధాన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని కొనియాడారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్పోర్ట్స్ పాలసీపై క్రీడాకారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ మక్తల్ నియోజకవర్గం లోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఏ రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. దీంతోపాటు రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో మినీ స్టేడియాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలను రచించిందన్నారు. సామాజిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో క్రీడా అకాడమీలుఏర్పాటు చేసి యువతలో క్రీడా నైపుణ్యాలు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీలో భాగంగా వివిధ క్రీడల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, యువతకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి మార్గం దిశగా చర్యలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, కట్ట సురేష్ కుమార్ గుప్తామాజీ ఉపసర్పంచ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాసులు,శాలం, ఫయాజ్,నాయకులు వాకిటి శ్యామ్, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, మందుల నరేందర్, శంషొద్దీన్, అఫ్రోజ్, మెకానిక్ రాము,మహమ్మద్ రఫ్, నీలగౌడ్ ఆనంద్, గుంతలి శివకుమార్, బ్యాగరి సురేష్, బహదూర్, సురేష్ గౌడ్, ముసలాయిపల్లి నాగరాజ్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కౌకుంట్లలో గరుడోత్సవం

**దేవరకద్ర, ఆగస్టు2 ప్రభాతవార్త:** శ్రావణమాసం రెండవ శనివారం పురస్కరించుకొని పిల్లి గుండ్ల కురుమయ్య స్వామికి సేవ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌకుంట్ల మండల కేంద్రంలో శ్రీ శ్రీ చెన్నకేశవ స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా గరుడ వాహన సేవతో భజనబృందం గ్రామ పురవీధుల్లో దర్శనమిస్తూ బయలుదేరారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. భజనపరులు పురవీధులో భక్తుల గోవిందా నామస్మరణలతో గరుడోత్సవం చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల ప్రజలు, భక్తులు, చెన్నకేశవ స్వామి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



గరుడోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## 282 జీవో శ్రామికులను నిలువు దోపిడీ చేయడమే

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్




మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

**నారాయణపేట టౌన్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 282 జీవోతొ 12 గంటల పని దినం ప్రవేశపెట్టడం శ్రామికులను నిలువూ దోపిడీ చేయడమేనని సిఐటియు రాష్ట్రఉపాధ్యక్షులు భూపాల్ విమర్శించారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సిఐటియు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తితో 8 గంటల పని దినంను నేడు ప్రభుత్వాలు రూపమాపుతున్నయన్నారు. కార్మికులను నిలువు దోపిడీ చేసేందుకు 12 గంటల పని దినాన్ని తీసుకొస్తున్నారని విమర్శించారు. భారత దేశంలో గుజరాత్, తరువాత కర్ణాటక ఇప్పుడు తెలంగాణ 12 గంటల పని దినాన్ని అమలు చేసేందుకు జీవోలు జారి చేయడం దారుణం అన్నారు. 16 లక్షల కోట్ల రూపాయలు అంబానీ, ఆదాని వంటి బడా బాబులకు రైట్ ఆఫ్ చేసిన కేంద్ర ప్రభుత్వం కార్మికులకు మాత్రం కనీస వేతనం 26,000 ఇవ్వాలన్న పీఎఫ్ ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్న విధానంతో లేకపోవడం దారుణం అన్నారు. స్వాతంత్రం పూర్వం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలన్నిటిని సవరించి యజమానులకుఅనుకూలంగా నాలుగు కార్మిక కోడ్‌లు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. ఆగస్టు 10న మక్తల్‌లో జరుగు అంగన్వాడి, ఆగస్టు 11న ఆశా వర్కర్స్ నారాయణపేట జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్రామరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్ రామ్, సిఐటియు ఉపాధ్యక్షులు జోషి, అంగన్‌వాడి ,ఆశ, మున్సిపల్ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## 6 నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలి

■ ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి

**జడ్చర్ల టౌన్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, మరే ఇతర ఆహారం పెట్టరాదని ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి, ఏఎన్ఎం మంజుల తెలిపారు. జడ్చర్ల మండల పరిధిలోని బాదేపల్లి సెక్టార్‌లో అంగన్‌వాడి సూపర్ వైజర్ సుగుణ ఆధ్వరంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోనే ముర్రుపాలు త్రాగించాలని, ముర్రు పాలు తాగించడం వలన బిడ్డకు రేగనిరోధక శక్తి వుంటుందన్నారు. ముర్రు పాలలో విటమిన్ ఏ, ప్రోటీన్ ఎక్కుగా వుంటుందన్నారు. బిడ్డకు ఈ 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనీ, తల్లి పాల వలన బిడ్డకు మెదడు అభివృద్ధి చెందుతుందని, తల్లిపాలె పోషకాలను సరియైన పరిమాణంలో అందిస్తాయన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడంవలన తల్లికి, బిడ్డకు అనుబంధం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు భారతి, అలివేలు, నాజియా, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ హెల్పర్లు తల్లులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిని కలిసిన పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు చేయడానికి వెళుతున్న తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్కని, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవిని, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని పెబ్బేరు మండల కేంద్రంలో పెబ్బేరు మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కలిసినవారిలో పెబ్బేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ్ వర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారపాకుల వెంకట్ రాములు యాదవ్, వెంకటేష్‌సాగర్, దయాకర్‌రెడ్డి, వెంకటరమణ, సురేందర్ గౌడ్, 8వార్డ్ ఇంచార్జి జహంగీర్, యుగేందర్ రెడ్డి, తిప్పాయిపల్లి మహేశ్వర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, రజక నరసింహ, వడ్డే అంజి, శుభ సాయి,నాయకులు కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజ్ ఎగ్జామ్స్ సెంటర్‌కు సహకరించిన నాయకులను సత్కరించిన ప్రిన్సిపల్



**పెబ్బేరు, ఆగస్టు2 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఎగ్జామ్ సెంటర్ లేకపోవడంతో ఎగ్జామ్స్ రాయడానికి తమ విద్యా ర్థులు ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చిందని ఇట్టి విషయాన్ని స్థానికుల నాయకులు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘారెడ్డితో మాట్లాడించి పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఒప్పించి తమ కళాశాలకు సొంత ఎగ్జామ్స్ సెంటర్ వచ్చే లా ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా వారి బృందా నికి శాలువాతో సత్కరించిఅభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్‌రెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్పాకుల వెంకటరమణ యాదవ్, నాయకులు దయాకర్‌రెడ్డి, జాంగిర్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శనేశ్వర స్వామి అభిషేక పూజలు

**బిజినపల్లి, ఆగస్టు2 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామంలో శనేశ్వర స్వామికి ఇలా తైల అభిషేక పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు అష్టమి, నవమి, త్రయోదశి, చతుర్దశి, అమావాస్య తిథులు ఉన్న రోజు శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా పూజించి అభిషేకించిన విశేష పుణ్య ఫలితం దక్కుతుందని ప్రధాన అర్చకులు గవ్వ మఠం విశ్వనాథ శాస్త్రి అన్నారు. కాకతీయుల సామంత రాజులు గోన బుద్ధారెడ్డి , గన్నారెడ్డి కాలం నాటి బ్రహ్మ సూత్రంగల పరమశివునికి భక్తులచే సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకపూజలు,అర్చనలు ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, కమిటీ సభ్యులు కేంచే రాజేష్ ప్రభాకరచారి, పుల్లయ్య,వీరశేఖర్,శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ విద్య




కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, ఆగస్టు2 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద జట్రంలో కంప్యూటర్ ల్యాబ్ ను పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు గౌరమ్మ ప్రారంభోత్సవం చేశారు. ఇటీవల ప్రభుత్వం అందజేసిన 10 కంప్యూటర్లను విద్యార్థులకు అందు బాటులోకి తీసుకొచ్చారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కూడా కంప్యూటర్ ఆధారిత విద్యను బోధించడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు ఆసక్తిగా వస్తారని తెలిపారు. కంప్యూటర్ విద్య ద్వారా శాస్త్ర, సాంకేతికతకు సంబంధించిన ప్రాథమిక అంశాలను బాల్యం నుండే నేర్చుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వెంకట్ రెడ్డి, రఘువీర్ నామాజీ, బస్వరాజ్, వెంకట్రాములు, అనిల్, గోపాల్, బాలప్ప, కృష్ణయ్య, తిరుమలేష్, సురేష్ పవార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..



అరెస్ట్ అయిన బీజేపీ నాయకులు

**అచ్చంపేట, ఆగస్టు2 ప్రభాతవార్త:** ఉమామహేశ్వర దేవాలయ అభివృద్ధి కోసం, ఆలయ ప్రాంగణంలో దర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలిగిస్తూ చేస్తున్న దోపిడిని అరికట్టి భక్తులకు న్యాయం చేయాలనే ఆలోచనతో పాదయాత్ర చేపడితే అడ్డుకోవడమేమిటని బిజెపి నాయకులు ప్రశ్నించారు. పాదయాత్రను అడ్డుకోవడం కాదు శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న దోపిడీని అరికట్టి ప్రజలకు న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న దోపిడీకి నిరసనగా అచ్చంపేట మండలం నుంచి ఉమామహేశ్వరం వరకు నిర్వహించబోయే పాదయాత్రలో పాల్గొవడానికి వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బిజెపి నాయకులు మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమే కాకుండా హిందూ ధర్మాన్ని అవమానపరచడమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అరెస్టులను ఉపసంహారించుకొని పాదయాత్రకు అనుమతించాలని, లేదంటే బీజేపీ ఉద్యమ కార్యాచరణ చేపడుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రేణయ్య, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూరి జానకి, బీజేపీ అచ్చంపేట టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, బీజెపి మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి, బిజెపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ అఖిల్ రెడ్డి, బిజెపి నాయకులు కార్తీక్ రెడ్డి, చందులాల్, శివ చంద్ర, అమర్, చైతన్య చారి ముందస్తు అరెస్టు చేసారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**వెల్దండ, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండలంలోని బండోనిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి నారాయణరెడ్డి కుమారుడు శేఖర్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉమాపతి, భిక్షపతి, ఉపేందర్, రవి,సురేష్‌కుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ



గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు2, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఈ.వి.ఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్‌బి.విజయేందిర బోయి శనివారం తనిఖీ చేశారు.నెలవారీ తనిఖీ లో భాగంగా కలెక్టరేట్‌లో గల ఈ.వి.ఎం. గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా గోడౌన్ సీల్ ను,సి.సి.కెమెరాలు,భద్రత పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోపలికి అనుమతించరాదని అధికారులను, సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు.జిల్లా కలెక్టర్ తో పాటు, ఎన్నికల డి.టి.జాఫర్,, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

మహబూబ్‌నగర్ పట్టణంలోని సారిక టౌన్‌షిప్ వద్ద ఏర్పాటు చేసిన భూత్పూర్ మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ బి.సి.సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఆకస్మికంగాతనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వఉంచిన సన్నబియ్యం, నిత్యావసర సరుకుల ను పరిశీలించారు. మెనూ బోర్డును పరిశీలించి, మెనూకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించారు.ఆహార పదార్థాలనుభద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితంకాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.5,10 వ తరగతి విద్యార్థినిలతో మాట్లాడారు.ఎలాచదువుతున్నారు.వసతులు ఎలా ఉన్నాయి,భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి చర్చించారు.ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందిస్తూ, మరింత మెరుగైన ఫలితాలువచ్చేలా కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ సమయ పాలన పాటిస్తూ, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవుపలికారు. పర్యవేక్షణ అధికారి ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు.

## ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడండి



తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**అయిజ ఆగస్టు 2, ప్రభాతవార్త;** పట్టణ కేంద్రం సమీపంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుండి రక్షించాలంటూ శనివారం మండల తాసిల్దార్ జ్యోతికి పట్టణ బిజెపి నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కంపాటి భరత్ రెడ్డి మాట్లాడుతు పట్టణంలోని"ప్రభుత్వ భూమికి సంబంధించిన 936 సర్వే నెంబర్" లో పోలీస్ స్టేషన్ కు ఎదురుగా బుడగ జంగాల కాలనీలో3 ఎకరాల ప్రభుత్వ భూమిని" అక్రమంగా ఒక వ్యక్తి కబ్జా చేసుకున్నాడని, వ్యవసాయం చేసుకోవడానికి గత 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఆ భూమిని ఇచ్చింది. ఆ భూమిలో సాగు చేయకపోవడంతో కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఆ వ్యక్తి పేరున ఉన్న భూమిని రద్దు చేసింది. అయితే కబ్జాదారుడు కోర్టుకు వెళ్లి నాకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని అన్యాయంగా లాక్కున్నారు, తిరిగి ఇప్పించండి అని కోర్టును ఆశ్రయించాడు.ఇదేమిటో పరిశీలించండి అని మాత్రమే కోర్టు కలెక్టర్ కార్యాలయానికి లేఖ పంపింది". ఏమి జరగకముందే కబ్జాదారుడు ఆ మూడెకరాల భూమిలో బోర్డు పెట్టి, ఇది నాకు కోర్టు ఇచ్చింది ఎవరైనా ఈ స్థలంలోకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.ఇది ఇలా ఉండగా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. అయితే ఆ వ్యక్తికి మూడు ఎకరాల భూమిని తిరిగి ఇచ్చారా లేదా అన్న విషయం తెలియదు.ఒకవేళ ఇచ్చి ఉంటే ఆ భూమిని సాగు చేసుకోవాలి కానీ కబ్జాదారుడు ఆ పొలంలో మట్టిని తోలి, ఎత్తుగా చేశాడు. దానివలన బుడగ జంగాల కాలనీ భారీ వర్షాలకు మునిగిపోయే అవకాశం ఉన్నది. కబ్జాదారుడు ఆ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించే ఆలోచనలు ఉన్నట్లు తెలుస్తుంది. అందుకనే ఆ మట్టిని తోలాడని, అధికారులు ఆ బోర్డుని మరియు మట్టిని తొలగించవలసిందిగా కోరుచున్నాము.ఒకవేళ ఆ భూమిని ప్రభుత్వం సదరు వ్యక్తికి కేటాయించినట్లయితే,మిగతా వారికి పత్రిక విలేకరులకు" కూడా భూమిని కేటాయించాలి. తమరు స్పందించకుంటే ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని, మీకు తెలియజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బి.నాగరాజు, వెంకటేష్ యాదవ్, వీరయ్య చారి, కే.రాజశేఖర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా స్నేహితుల దినోత్సవం



స్నేహితుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండలంలోని కోట్ర చౌరస్తా వద్దనున్న శాస్త్ర ఇంటర్నేషనల్ పాఠశాలలో స్నేహితుల దినోత్స వాన్నిశనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రుల తో జ్యోతి ప్రజలను చేసి తొలి స్నేహితులు అమ్మానాన్న గురువు అని చిన్నారి బాలబాలికలచే తల్లిదండ్రులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల యజమాన్యం శాలువాలతో సన్మానించారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో చైర్మన్ గుబ్బ శంకరయ్య, డైరెక్టర్లు నరేష్, సాయి స్వరూప్, స్వర్జన్ బాబు, ప్రిన్సిపాల్ రవితేజ, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు కళావతి, సంధ్యారాణి, రేణుక, విజయలక్ష్మి, గాయత్రి లావణ్య పావనితో పాటు తదితరులున్నారు.

## బిల్డర్స్ డెవలపర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులుగా చెరుకుపల్లి రాజేశ్వర్



రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న బేక్కరి రాంరెడ్డి

**మహబూ'బ్‌నగర్, ఆగస్టు2 ప్రభాతవార్త:** కన్సడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఆర్ఇడిఐఎ) బిల్డర్స్ డెవలపర్స్ ఆర్గనైజేషన్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త..చెరుకుపల్లి రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. (సిఆర్ ఇడిఐఎ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బేక్కరి రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చెరుకుపల్లి రాజేశ్వర్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా రాఘవేందర్ గౌడ్, అంబటి మణిదీప్, అబ్దుల్‌ఖాదర్, భోగ కోదండపాణి,జనరల్ సెక్రెటరీగా కడుదాస్ రాజేష్, జాయింట్ సెక్రటరీలుగాకృష్ణబాబు, మొహమ్మద్ సిరాజ్‌తిరుపతిరెడ్డి, ట్రెజరర్‌గా మన్యంరెడ్డిలు ఎన్నిక య్యారు. ఈసీ మెంబర్లుగా రామచంద్రరావు, రాజ్‌కుమార్‌రెడ్డి,మయూర్ పటేల్‌లు ఎన్నిక య్యారు. కొత్త అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన చెరుకుపల్లి రాజేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

నిరంతరం నిర్వహిం చడం జరుగుతుందనీ, అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) వారికి డయల్ 100 కి కాల్ చేసి పోలీసువారికి సమాచారం ఇవ్వగలరనీ తెలిపారు. బాల కార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలుతీసుకుంటామని అన్నారు.పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# కాళేశ్వరం పేరుతో దోపిడీ

◆ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ◆ జడ్చర్ల పెద్దగుట్ట రంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ డీకే అరుణ

**జడ్చర్ల, ఆగస్టు 2,ప్రభాతవార్త:** కాళేశ్వరం కమిటీ నివేదిక ద్వారా ప్రాజెక్ట్ నిర్మాణంలో ఎంత అవినీతి జరిగిందో మనకు అర్థమవుతుందని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఎవరికైతే ఈ ప్రాజెక్టు అవినీతిలో భాగస్వామ్యం ఉందో వారందరి పైన కూడా చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఎంపీ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్ల పెద్ద గుట్టపై వెలసిన రంగనాయక స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సందర్శించి రంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కాల్వ రామ్ రెడ్డి దంపతులు ఎంపీ డీకే అరుణను ఆలయ సాంప్రదాయ ప్రకారం సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం



ప్రాజెక్టును కేవలం దోపిడీ చేయడానికి ప్రాజెక్టు పేర్లు మారుస్తూ అంచనాలు పెంచుతూ అడ్డగోలుగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, ప్రాజెక్టు అడ్డగోలుగా నిర్మాణం జరిగిందని ఎలాంటి డిజైన్ లేకుండా సొంత నిర్ణయం తోటి లోపభూయిష్టం తోటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని స్పష్టమైందని, దీనికి బాధ్యులైన అందరి పైన కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఎంపీ వెంట బిజెపి రాష్ట్ర కార్యదర్శి పద్మజా రెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి ,పట్టణ అధ్యక్షుడు అమర్నాథ్ గౌడ్, ఎంబి బాలకృష్ణ, బాలవర్ధన్ గౌడ్ బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## వెల్టూర్ గుందిమల్ల బ్యారేజ్‌తోనే అభివృద్ధి

◆ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, ఆగస్టు2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి కృష్ణానది నీటి వాటా కేటాయింపులో గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని, కృష్ణా నది నీటిని వినియోగించుకోవడంలో ఆంధ్ర కంటే తెలంగాణ వెనుకబడిందని తెలంగాణకు రావాల్సిన వాటా నీటి నీ వినియోగించుకోవడానికి వెల్టూరు గొందిమల్ల బ్యారేజ్ నిర్మాణం తోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొన్న కొల్లాపూర్ బహిరంగ సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బ్యారేజ్ నిర్మాణంతో ఒక్క ఎకరం భూమి కూడా మునకకు గురి కాకుండా, సుమారు 60 టీఎంసీల నీటిని నిలుపుకోవచ్చని, అట్టి నీళ్లను సమీపంలో ఉన్న 6 నియోజకవర్గాలకు సాగు, త్రాగునీటికి ఉపయోగించుకోవచ్చని, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సైతం నీటిని తరలించవచ్చు అని అన్నారు. ఒక్కసారి ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణం చేపడితే, భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగ ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కు సూచించారు. అలాగే నియోజకవర్గంలో శ్రీశైలం నిర్వాసితులుగా ఉన్న గ్రామాలకు మట్టి ఇండ్ల స్థానంలో కొత్త ఇండ్ల నిర్మాణానికి కోసం నియోజకవర్గానికి మరో 3 వేల ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. 40 ఏళ్ల క్రితం విడుదల చేసిన జీవో98 శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యానికిగురి అయ్యారని, వారికి వీలైనంత త్వరగాపంచాయతీ కార్యదర్శి, వీఆర్వో,లస్కర్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.నియోజకవర్గంలో మాదాసి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల జారీలో అన్యాయం జరిగిందని వారికి న్యాయం చేయాలని కోరారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేయాలనికోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏ ప్రజలకు శ్రీరామరక్షా అని ప్రజల సమస్యలను గుర్తించి విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ సబ్స్టేషన్ల నిర్మాణం,సన్నవడ్లకు 500 బోనస్, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు శ్రీరామరక్ష లాంటిదని మంత్రి జూపల్లి పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

◆ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి, జిల్లా ఎమ్మెల్యేలు

**కొల్లాపూర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం సోమశిల తెలంగాణ టూరిజం గెస్ట్ హౌస్ వద్ద జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు డా. రాజేష్ రెడ్డి, డా. వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మెఘ రెడ్డి, యెన్నంశ్రీనివాస్ రెడ్డిలతో కలిసిఉప ముఖ్యమంత్రి జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, గురుకులాలు,విద్యా వైద్యం, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమక్షంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో లోటు పొరపాట్లకు తావు లేకుండా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా, పూర్తిస్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మేలు చేసే ఉద్దేశంతో ఆయా పథకాలు ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు.పథకాలు లోపాలు లేకుండా పటిష్టంగా అమలుకు అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యాపరంగా గురుకులాల్లో విద్యార్థులకు ఇలాంటి సమస్యలు లేకుండా అధికారులు పూర్తిస్థాయిలో పరిరక్షించి మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

◆ బిజెపి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ

**వనపర్తి రూరల్, ఆగస్టు2 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. శనివారం నాడు బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు ఆదేశం మేరకు మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా ఆగస్టు 3, 4 తేదీలలో ఇంటింటికి బిజెపి ఇంటింటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు యోజనలో భాగంగా పోలింగ్ బూతు పరిధిలోని ప్రతిఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు,కమిటీ సభ్యులు వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ అభివృద్ధి లక్ష్యాలు, మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలు, సాధించిన ప్రగతిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఉత్తుత్తి గ్యారెంటీలు, ఉద్దెరహామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్లయిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలముందుంచాలని, గ్రామాలలో వార్డు మెంబర్లు, సర్పంచుల, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తయి 18 నెలలైన స్థానిక ఎన్నికలు నిర్వహించలేదని స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శుల పాలనతో గ్రామాలు పూర్తిగా అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేసే అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రామన్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి బిజెపిజిల్లా మీడియాఇన్చార్జ్ పెద్దిరాజు, వెంకటేష్ నాయుడు ,బొడ్డుపల్లి వెంకటేష్, సుగురూ రాములు, ఆగపోగుకుమార్, బిజెపి పట్టణ అధ్యక్షుడు ఏ రాజశేఖర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు నవీన్, నల్లవతుల అరవింద్, రాయన్న సాగర్, ఉండే కోటి అంజి, ఉపేందర్ యాదవ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు మండల రాజు, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు చాణిక్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల వేడుకను విజయవంతం చేద్దాం

◆ నవంబర్ 27, 28, 29 తేదీల్లో బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు

◆ ఆగస్టు 31న పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ వెల్లడి

**జడ్చర్ల ఆగస్టు 2,ప్రభాతవార్త:** బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిద్దామని, భాగంగా ఈనెల 31న పట్టణంలోని చంద్ర గార్డెన్ లో పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం ఉంటుందని కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ వెల్లడించారు. శనివారం జడ్పిహెచ్ఎస్ బాలుర బాదేపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 27, 28, 29 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నిర్వహించే సన్నాహక సమావేశానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని స్పష్టం చేశారు. 1925లో ప్రారంభమైన పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం మూడు భాషల్లో బోధన కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న మూడవ పాఠశాలగా అభిప్రాయపడ్డారు. బడి రుణం తీర్చుకునేందుకు ప్రతి పూర్వ విద్యార్థి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని దేశ విదేశాల్లోనూ పేరు ప్రఖ్యాతలు గాంచారని తెలిపారు. అలాంటి హై స్కూల్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం అందులో భాగస్వామ్యం కావడం వరమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసుకుందామని అందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో శతాబ్ది ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ,ఉపాధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం,గోపాల్, పెద్ద బాలకృష్ణ, ఆకుల వెంకటే,ష్ జీనురాల సత్యం, టైటాన్స్ సత్యం, శ్రీనివాస్ చారి, జయప్రకాష్, ప్రకాష్, సంతోష్ చారి, కార్యనిర్వహణ కార్యదర్శి కంచుకోట ఆనంద్, రాఘవేందర్ గౌడ్, ఉపాధ్యాయులు సునీల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్న కొడుకులే చంపుతామంటున్నరు

- రైతుబంధు డబ్బులు ఇవ్వాలంట..
- పోలీసులను ఆశ్రయించిన ఓ తల్లి

**జోగులాంబ గద్వాల,ఉండవల్లి, ఆగస్టు2,ప్రభాతవార్త:** కన్న తల్లిపై కొడుకులే కర్కశత్వం ప్రదర్శిస్తున్నారు. కనికరం కూడా ప్రవరిస్తన్నారు. కాటికి కాలు చాపిన వయస్సులో కుమారుల బాధలు తట్టుకోలేక ఓ తల్లి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం లో చోటుచేసుకుంది. ఎస్సై శేఖర్ కథనం ప్రకారం.. ఉండవల్లి మండలం కలుగోట్ల గ్రామానికి చెందిన కురువ లక్ష్మీదేవి ఆమెకు ఇద్దరు కుమారులు శంకర్, మల్లికార్జున్. లక్ష్మీదేవి భర్త నాగన్న మరణించడంతో ఇద్దరు కొడుకులు ఆమెను పట్టించుకోకపోవడంతో ఒంటరిగానే జీవనం సాగిస్తుంది. అయితే ఆమె పేరిట కొంత వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని ఇద్దరు కుమారులు సాగు చేసుకుంటూ ఆమెను పట్టించుకోవడం లేదు.కానీ వ్యవసాయ పొలానికి సంబంధించి రైతుబంధు డబ్బులు మాత్రం తల్లి అకౌంట్లో పడడం తో ఆ డబ్బులు ఇవ్వాలంటూ తరచూ వేధిస్తున్నారు. కాస్తో కూస్తో వచ్చిన రైతుబంధు డబ్బులను కూడా మీకు ఇస్తే నేను ఎలా బతకాలని ఇద్దరి కుమారులతో వాదించింది. శనివారం శంకర్ తల్లి ఇంటికి వెళ్లి రైతుబంధు డబ్బులు ఇవ్వాల్సిందేనని కోపంతో ఇద్దరు ఆమెపై దాడి చేశారు.కర్రతో బలంగా కొట్టడంతో తలపై రక్త గాయాలు అయ్యాయి. డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తామని పది రోజుల కిందట మల్లికార్జున్ కూడా తల్లిని బెదిరించినట్లు తన ఇద్దరుకుమారులపై ఉండవల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కొల్లాపూర్‌లోనే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నాను..

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉంటుందని చెప్పారు.ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, మీ సాకారం కూడా కావాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కోరారు. ఇక్కడ డ్యాం నిర్మాణం వల్లనాగర్ కర్నూల్ జిల్లాతో పాటు నార్లాపూర్ మోటర్లు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన ఎల్లూర్ లిఫ్ట్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లకు కూడా నీటిని వినియోగించుకోవచ్చని తెలిపారు.కొల్లాపూర్‌లో విద్యాభివృద్ధికి ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు 98 జీవో ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉండే కానీ అది నెరవేరలేదని, వారికి కనీసం పంచాయతీ సెక్రటరీ లేదా లష్కర్ ఉద్యోగాలు ఇవ్వాలని లేకపోతే ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, మాదాసీలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీకి కృషి చేయాలని కోరారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో లైబ్రరీల అభివృద్ధికి కోటి రూపాయాలు ఇస్తానని ప్రకటించిన ఎంపీ మల్లు రవికి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంతో సుమారు 35 గ్రామాలు ముంపునకుగురయ్యాయని, అప్పుడుచెల్లించిన నష్టపరిహారం సరిపోలేదని పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజలు అనాడు నిర్మించుకున్న మట్టి మిద్దెలు కూలిపోతున్నాయని, ఈ గ్రామాలతో పాటు జీవో నెం. 123 తో నష్టపోయిన నార్లాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, డిసిసిబి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం గద్వాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య, సంబంధిత శాఖల అధికారులు, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పీయూలో కొనసాగుతున్న అడ్మిషన్లు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 2,ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ లో కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీ లో అడ్మిషన్స్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుంది. శనివారం ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్ అడ్మిషన్స్ ప్రక్రియ సరళి ని పరిశీంచారు. ప్రిన్సిపాల్ డా చంద్రకిరణ్ మాట్లాడుతూ ఆన్లైన్ లో సెల్ఫ్ రిపోర్ట్ చేసిన 178 మంది విద్యార్థులలో 171 మంది ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇచ్చి అడ్మిషన్స్ పొందరాని, 100 మంది విద్యార్థులు హాస్టల్‌కి అప్లై చేశారని, త్వరలో క్లాసెస్ కి సంబంధించి షెడ్యూల్ ప్రకటిస్తామని అన్నారు.చీఫ్‌వార్డెన్ డా కృష్ణయ్య,రామేశ్వర్, భరత్, నరేష్, రవి, ఆంజనేయులు వీసీతో పాటు ఉన్నారు.

## నైపుణ్యాలతోనే ఉద్యోగాలు



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 2,ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ యందు జువాలజీ విభాగంలో ప్రథమ సంవత్సర విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమమునకు ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ నైపుణ్యాలు ఉంటే ఉద్యోగాలకు కొదవలేదని, జువాలజీ పూర్తి చేసిన విద్యార్థులకు దేశ విదేశాలలోఉద్యోగ అవకాశాలు ఉంటాయని, కొన్ని కన్సల్టెన్సీలు విదేశాల ఉద్యోగాలు కల్పిస్తాయని, సాంకేతికంగా బలం గా ఉండాలని,డార్విన్ సిద్ధాంతం ప్రకారంగా మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు చెందాలని అని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్యపూస రమేష్ బాబు, ప్రిన్సిపల్ మధుసూదన్ రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ వేణు, అధ్యాపకులు డాక్టర్ గురుస్వామి, డాక్టర్ లక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కరిగిపోతున్న మట్టిగుట్టలు

**మద్దూర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల సమీపంలో ఉన్న ఎర్రగుంట తండాలో మట్టి గుట్టలు కరిగిపోతున్నాయి. ప్రతిరోజు ఈ గుట్ట నుంచి టిప్పర్ల ద్వారా మొరం మట్టిని తరలిస్తున్న రెవిన్యూ సిబ్బంది నిమ్మకనీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కొందరుఏకంగా జెసిబి గుట్టకు పెట్టి టిప్పర్లకు మొరం నింపుతున్నఅధికారులు చూసి కూడా ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు అంటున్నారు. రెవెన్యూ సిబ్బంది వారి దగ్గర ఆమ్యంయాలుతీసుకొనిఒక పెద్దఅధికారికి ముట్టచెప్పుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం ద్వారా తెలిసింది? ఆ టిప్పర్లకు ఎటువంటి పర్మిషన్ఇవ్వకుండా దర్జాగా మద్దూర్ పట్టణ కేంద్రంలో బహిరంగంగా మట్టిని తరలిస్తున్న అధికారులు చూసి కూడా ఎందుకు ఏమంటలేరని పలువురుఆరోపిస్తున్నారు.ఈ విషయంపై ఎన్నోసార్లు ట్రాక్టర్‌యజమానులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయి ఒదని కొందరు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి ఈమొరంమట్టిమాఫియానుఅరికట్టాలని పలువురు కోరుతున్నారు.